ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టిపెట్టండి

జల సత్యనారాయణ

సనత్‌నగర్: భావితరాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ జల సత్యనారాయణ సూచించారు. జలమండలి ఎండీ సూచనల మేరకు బుధవారం జెక్‌కాలనీ గాంధీపార్కులో వాటర్ హార్వేస్టింగ్‌పై కాలనీ నివాసితులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా నీరు భూమిలో ఇంకే పరిస్థితి తగ్గిపోతుందని, తద్వారా వరదనీరు వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ల నివాసితులు తమకున్న స్థలంలోనే ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని సూచించారు.
అలాగే ఇప్పటికే ఉన్న ఇంకుడుగుంతలను ఏ విధంగా పునరుద్ధరించుకోవాలో వివరించారు. బోర్లు ఎండిపోయి ఉన్న పక్షంలో చుట్టూ ఇంకుడుగుంతలను నిర్మించుకుని వరదనీటిని తరలించే చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. తద్వారా బోర్లకు పునరుజ్జీవనం లభిస్తుందన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణంలో అనుసరించాల్సిన సాంకేతిక పద్ధతులను ఆయన వివరించారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి డిజైన్ చేసుకుని ఇంకుడుగుంతను నిర్మించుకోవడం ద్వారా వరదనీటిని ఒడిసి పట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు పాల్గొన్నారు.


ఇంకుడుగుంతలపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

నేచర్ క్యూర్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి రాజనర్సింహ

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం అమీర్‌పేటలోని నేచర్ క్యూర్ ఆసుపత్రిని సందర్శించారు. ఆయూష్ పరిధిలోకి వచ్చే యోగాధ్యాయన పరిషత్ వైద్య కళాశాల, ఆయుర్వేద, సిద్ధ విభాగాలలో పనిచేసే అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆసుపత్రి, యోగా కేంద్రం, కాటేజీలను పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. భవిష్యత్‌లో ప్రకృతి వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, ఆయుష్ కమిషనర్, యోగాధ్యాయన పరిషత్ కార్యదర్శి ఎం.ప్రశాంతి, ఆసుపత్రి అధికారులు సాయిరాం, భానుకిరణ్ ఉన్నారు.

డీబీఎఫ్ మహాసభను జయప్రదం చేయాలి

బన్సీలాల్‌పేట్: ఈ నెల 30న జరిగే దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన పిలుపునిచ్చారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో బుధవారం డీబీఎస్ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పులి కల్పన మాట్లాడుతూ.. ఈ నెల 30 గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున మహిళలు, బస్తీ ప్రజలు తరలి రావాలన్నారు. ఈ మహాసభను భారత మొదటి దళిత కార్డియాలజిస్ట్ డాక్టర్ గోపీనాథ్ ప్రారంభించి ఉపన్యాసిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఏఎస్‌లు గోపాల్‌రావు, ఆకునూరి మురళి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సుజాత, జ్యోతి, పార్వతీ, శశికళ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.


మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించిన పులి కల్పన

కరపత్రాల పంపిణీ..

అడ్డగుట్ట: దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పులి కల్పన కోరారు. బుధవారం డివిజన్‌లోని సాయినగర్, మొండిబండనగర్, తుకారాంగేట్ తదితర ప్రాంతాల్లో మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ, రమ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌కు చెక్


అక్రమ పార్కింగ్‌లను తొలగింపజేస్తున్న ఎస్‌ఐ కరుణాకర్

సాక్షి ఎఫెక్ట్..

బౌద్ధనగర్: రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని చిలకలగూడ ట్రాఫిక్ ఎస్‌ఐ కరుణాకర్ హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో నెలల తరబడి వాహనాలను రోడ్ల పక్కనే నిలుపుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యపై 'అక్రమ పార్కింగ్‌తో అవస్థలు' అనే శీర్షికతో ఈ నెల 29న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఎస్‌ఐ కరుణాకర్ ఆధ్వర్యంలో బుధవారం వారాసిగూడ నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ పార్కింగ్‌లను తొలగింపజేశారు. రోడ్లకిరువైపులా వాహనాలను నిలపరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తా

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన చామకూర సుజాత తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా నియమితులయ్యారు. బుధవారం పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనను కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించినందుకు సంతోషంగా ఉందని రానున్న కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందేలా కృషి చేస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పేరు ప్రతిష్టతలను ఇనుమడింపజేసేలా కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ద్వారా పార్టీ బలోపేతంగా దిశగా ముందుకు సాగుతానని అన్నారు. ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుకు కృతజ్ఞతలు తెలిపారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న చామకూర సుజాత

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఝాన్సీ

అడ్డగుట్ట: ప్రభుత్వం అందించే పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కమిట్మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఝాన్సీ సూచించారు. బుధవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్లో యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ఝాన్సీ పాల్గొని అంగవైకల్యం రావడానికి గల కారణాలు వివరించారు. ముఖ్యంగా మేనరికం ద్వారా, గర్భంలో ఉన్నప్పుడు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం, పుట్టిన తర్వాత సరైన వైద్యం అందకపోవడంతో అంగవైకల్యం వచ్చే అవకాశాలుంటాయన్నారు. అంతే కాక వికలాంగులు మరో వికలాంగులను పెళ్లి చేసుకోవడం ద్వారా కూడా అంగవైకల్యంతో పిల్లలు పుట్టే ఆస్కారం కూడా ఉంటుందన్నారు. వికలాంగుల కోసం ప్రభుత్వం చట్టం ద్వారా కొన్ని అమర్చడం జరిగిందన్నారు. 2016వ చట్టం ప్రకారం, అంగవైకల్యం ఉన్న పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. అదే విధంగా ఉద్యోగం చేసే వారికోసం ప్రత్యేక సదుపాయాలు, వ్యాపారం చేసుకునే వారి అవసరాల కోసం రుణాలు అందించేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రవీణ్‌కుమార్, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది కూల్చారు.. కొత్తది మరిచారు!

నిలిచిపోయిన అడ్డగుట్ట మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు

- నాలుగేళ్లైనా పూర్తి కాని వైనం
- పూర్తి చేయాలంటున్న స్థానికులు
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు

అడ్డగుట్ట: ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్టలోని కమ్యూనిటీ హాల్లో సరైన వసతులు లేకపోవడం, శిథిలావస్థకు చేరడంతో స్థానికుల సౌకర్యార్థం 2020లో స్థానిక ఎమ్మెల్యే, గత డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కమ్యూనిటీహాల్ తొలగించి దాని స్థానంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో జీప్లస్-1 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ. 2.25 కోట్ల నిధులు మంజూరు చేసి ఆయనే స్వయంగా శంకుస్థాపన చేశారు. అంతకు ముందే కమ్యూనిటీహాల్ డిస్మెంటల్ పనులు ప్రారంభించిన అధికారులు, శంకుస్థాపన తర్వాత కమ్యూనిటీహాల్‌ను పూర్తిగా నేలమట్టం చేశారు. అప్పటి నుండి దాని ఊసే మరిచిన సంబంధిత అధికారులు కొద్ది నెలల తర్వాత పనులు ప్రారంభించారు. ఆ తర్వాత నుంచి నత్తనడకన సాగుతూ వస్తున్న నిర్మాణ పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. గతంలో ఉన్న కమ్యూనిటీ హాల్లో చిన్న చిన్న శుభకార్యాలతో పాటు పెళ్లిలు కూడా జరిగేవని, అధికారుల నిర్లక్ష్యపు పనుల కారణంగా నాలుగేళ్లుగా శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి చోటు లేకుండా పోయిందని స్థానిక బస్తీవాసులు వాపోతున్నారు.

రూ. 2.25 కోట్లతో..

2020లో ఆగస్టు 5న రూ. 2.25 కోట్ల నిధులతో అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నత్తేనయం అన్న చందంగా కొన్నేళ్లు నిర్మాణ పనులు సాగినా, ఏడాది క్రితం నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని హంగులతో అడ్డగుట్టలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడంతో స్థానికులు సంతోష పడ్డారు. కాని నిర్మాణ పనుల్లో మొదట జాప్యం కనబర్చడంఇప్పుడు ఏకంగా పనులే నిలిచిపోవడం పట్ల స్థానికులు నిరాశ చెందుతున్నారు. ఆర్థిక పరంగా వెనుకబడి ఉన్న అడ్డగుట్ట వాసులకు మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపకరించే విధంగా ఉంటుందని ఆశ పడ్డామని, అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఫంక్షన్ హాల్ నిర్మాణం ఎప్పటికి జరుగుతుందో అర్థం కావడం స్థానికులు వాపోతున్నారు. ప్రజలందరికీ ఎంతో ఉప కరించే మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం పట్ల అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం సరైంది కాదని, నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించాలని అడ్డగుట్ట వాసులు డిమాండ్ చేస్తున్నారు.


నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ పనులు


మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పద్మారావుగౌడ్(ఫైల్)

పనులను పునః ప్రారంభించాలి



పేద, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అడ్డగుట్ట కమ్యూనిటీహాల్ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అది పూర్తిగా తొలగించి అధునాతన హంగులతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలు నిర్మించాలనే ఆలోచనతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆ తర్వాత ఇటుపక్క చూడకపోవడం గమనార్హం. నాలుగేళ్లుగా సాగదీస్తున్న పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తేవాలి.
– మంద అశ్విని, కాంగ్రెస్ నాయకురాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పద్మారావునగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం..బోయిగూడ ఆరోగ్య రహస్య షాపు సమీపంలోని మెట్రోపిల్లర్-1022 ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు మెట్రో సెక్యూరిటీ సూపర్‌వైజర్ సురేందర్ సింగ్ సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు, 108 సిబ్బంది వ్యక్తిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు సుమారు 40- 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి లుంగీ, బ్లూకలర్ బెడ్ షీట్‌తో ఉన్నాడని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు .

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రామకృష్ణాపురం రైల్వేస్టేషన్ సమీపంలో వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల ఉంటాయని నడుస్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని సంబంధీకులు ఉంటే 8712658581 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



గాజాపై ఇజ్రాయిల్ దాడి ప్రపంచశాంతికి విఘాతం


మాట్లాడుతున్న ప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ: గాజాపై ఇజ్రాయిల్ దాడి ప్రపంచశాంతికి విఘాతమని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షులు పి.ప్రసాద్ అన్నారు. గాజాలో మారణహోమానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం అనే అంశంపై బుధవారం పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇజ్రాయిల్ దురాక్రమ దాడుల్లో అమాయకులైన పాలస్తీన ప్రజలు లక్షలాది మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో అతి పెద్ద మరణహోమం అన్నారు. యుద్ధానికి అమెరికా ఆయుధాలు సరఫరా చేసి ఆర్థికంగా లబ్ధి పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, సామాజిక రాజకీయ కార్యకర్త సారా మాథ్యూస్, ఐఎఫ్‌టీయూ నేతలు పి.ప్రసాద్, బూర్గుల ప్రదీప్, ఓయూ ప్రొ.నాగేశ్వర్‌రావు, పీవైఎల్ నాయకుడు ఇందూరి సాగర్, ఎస్వీ శ్రీకాంత్, కోల లక్ష్మీనారాయణ జాన్సీ, గౌతం కుమార్, శ్రీకాంత్, గొర్రెపాటి రమేష్, రవి పాల్గొన్నారు.

బోధనాసుపత్రుల్లో డైట్ బకాయిలు చెల్లించండి

గాంధీఆస్పత్రి : తెలంగాణలోని బోధనాసుపత్రుల్లో రోగులు, వైద్యులకు ఆహార పదార్థాలు సరఫరా చేసే డైట్ క్యాంటీన్‌కు సంబంధించి బకాయి బిల్లులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ హాస్పిటల్స్ డైట్ క్యాంటిన్ సప్లయర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆయా ఆస్పత్రుల్లో డైట్ క్యాంటిన్ నిర్వహణ చేపట్టిన కాంట్రాక్ యాజమానులు బుధవారం మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ)ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం డైట్ బిల్లుల బకాయిలు కేవలం మూడు నెలలకు మాత్రమే పరిమితమని, కానీ ఆయా బోధనాసుపత్రుల్లో ఆరు నెలల నుంచి ఏడాది వరకు కోట్లాది రూపాయల బిల్లు బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సుమారు ఏడాది కాలంలో ఒక్క రూపాయి కూడా డైట్ బిల్లులు చెల్లించలేదన్నారు. ఉస్మానియా, పేట్లబురుజు ఆస్పత్రుల్లో 2023 సెప్టెంబర్ నుంచి డైట్ బిల్లుల నిధులు విడుదల చేయలేదన్నారు. నిలోఫర్ ఆస్పత్రిలో పది నెలలు, సంగారెడ్డి జీజీహెచ్‌లో ఎనిమిది నెలలు, సూర్యాపేట జీజీహెచ్, వరంగల్ ఎంజీఎంలో ఆరు నెలల నుంచి డైట్ బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సంబంధిత వైద్య ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే డైట్ క్యాంటిన్ బకాయి బిల్లుల నిధులు విడుదల చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శులకు వినతిపత్రాలు పంపామని, బిల్లులు చెల్లించకుంటే త్వరలోనే కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని వినతిలో పేర్కొన్నారు.


డీఎంఈకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పార్కులను పట్టించుకోరా?

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ పార్కులకు నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. సరైన నిర్వహణ లేక పార్క్ స్థలాల్లో ఏర్పాటు చేసిన క్రీడా వస్తువులు, బెంచీలు సైతం చోరీకి గురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లోని పార్క్‌ల గేట్లు సైతం విరిగిపోయినా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తార్నాక స్ట్రీట్ నెంబర్-3లో ఉన్న పార్కు గేటు ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుంది. లాలాపేట హౌజింగ్ బోర్డు కాలనీ పార్కు పెంటదిబ్బగా తయారైంది. లాలాపేట వినోభానగర్ పార్కు స్థలం వివాదంలో చిక్కుకుంది. లాలాపేటలోని భారత్ యూత్ క్లబ్ పార్కు చెత్త డంపింగ్‌కు నిలయంగా మారింది. తార్నాక, లాలాపేట తదితర ప్రాంతాల్లోని జనవాసాల మధ్య నిరుపయోగంగా మారిన పలు పార్క్ స్థలాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మరి కొన్నింటి స్థలాలపై కన్నేసిన కబ్జాదారులు తప్పుడు పత్రాలను చూపించి అధికారులను బోల్తా కొట్టించి కొంత పార్కు స్థలాన్ని ఆక్రమించారు. ఉన్నతాధికారులు స్పందించి పార్కులపై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.


ధ్వంసమైన పార్కుగేటు


నీరు లేక ఎండిపోతున్న పచ్చిక బయళ్లు


పార్కు పక్కనే వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: మోండా మార్కెట్, పాటిగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉదయం గాంధీ నగర్ పీఎస్, బోయిగూడ గార్డెన్, సన్మాన్ బట్టీ, రైల్వే క్వార్టర్స్, ప్రభుత్వ హైస్కూల్, ఆర్పీరోడ్, ఓల్డ్ గాస్మండి, బాటనీ స్కూల్, వాటర్ వర్క్స్ బన్సీలాల్‌పేట్ క్లాస్ ఏబీసీ ప్రాంతాలు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 గంటల వరకు మానస నర్సింగ్ హోమ్, టెలిఫోన్ భవన్, కిమ్స్ మెయిన్ రోడ్ ప్రాంతాలు. సాయంత్రం 3 గంటల నుంచి 4.30 వరకు రాణిగంజ్ బస్ డిపో, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 37, దొండ 23, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 75, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 31, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 70, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పెండింగ్ స్కాలర్‌షిప్‌ల విడుదలకు వినతి


వినతిపత్రం ఇస్తున్న లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ నేత లింగంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు వినతి పత్రం సమర్పించారు. వినతి ఇచ్చిన వారిలో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు రవి, తదితరులు ఉన్నారు.

1న తార్నాకలో హనుమాన్ జయంతి

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని లక్ష్మీ గణపతి దేవాలయంలో జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజాది కార్యక్రమాల్లో ఆంజనేయ స్వామికి క్షీరాభిషేకం, సింధూర అలంకరణ, ఆకు పూజ, అర్చనలు, సర్వసేవలు తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని భక్తులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని బండ శివారెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

యువకుడి అదృశ్యం


జయంత్‌కుమార్

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈస్ట్‌మారేడుపల్లిలోని శ్రీపురికాలనీకి చెందిన జయంత్ కుమార్(21) ఈ నెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికి, స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి బాల్‌రాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

పంజగుట్ట: జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. బీసీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యే అవకాశం చాలామటుకు కోల్పోతున్నారని, రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కనీసం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులుగా అయినా అవుతారని ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల వెనకబాటు తనానికి గత పాలకుల విధానాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమన్నారు. జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా భయ్యా వెంకటనర్సింహా రాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎలిగేటి కృష్ణవేణిలను ఎంపికచేసి నియామక పత్రం అందజేశారు.

